

అయ్యప్పస్వామి మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అయ్యప్ప స్వాములు తదితరులు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత యాంత్రిక జీవితంలో ఒత్తిడిలకు గురయ్యే వారిలో భక్తి, ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీప్రజా సాయి అపార్ట్‌మెంట్స్‌లో అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయ్యప్పస్వామికి పూజలు చేసి మాట్లాడారు. అయ్యప్పస్వామి మాలధారణతో 41 రోజుల పాటు ఏకాగ్రతతో భక్తిభావంతో వ్యవహరించిన స్వాముల్లో సంపూర్ణమైన ఆరోగ్యవంతులవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు తథ్యం

చిక్కడపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు తథ్యమని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి నర్సింగ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన జూబ్లీహిల్స్‌లోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రచారానికి విశేషమైన స్పందన లభించిందన్నారు. గుర్రం దినేష్, బానుచందర్, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండుగగా తులసీ కల్యాణం

చిక్కడపల్లి, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం తులసీ కల్యాణం కనులపండుగగా నిర్వహించారు. ఆలయంలో సాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఈవో దేవనాథం, చైర్మన్ జానకి సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశ దీపోత్సవం కార్యక్రమాలు జరిగాయి. ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో తులసిలగ్నం కార్యక్రమం జరిగింది. ఏకవార రుద్రాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీపపూజ, కార్తీకపురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజలు జరిగాయి. ఈవో లక్ష్మారెడ్డి, చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

నేడు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు

ముషీరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కార్యక్రమం లో భాగంగా ఎస్ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ బాలుర హైస్కూల్‌లో డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శివరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముషీరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు తమ వంతు కృషిచేస్తున్నామని పేర్కొన్నారు.

సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ సొసైటీ కార్యవర్గం



మాట్లాడుతున్న సయ్యద్ ఇక్బాల్ తదితరులు

బర్కత్‌పుర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిండికేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ తెలంగాణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. కాచిగూడలో జరిగిన సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వెంకటి, కార్యదర్శిగా పరమేశ్వర్, కోశాధికారిగా వినోద్, కార్యవర్గ సభ్యులుగా హనుమంతరావు, శ్రీనివాస్, లక్ష్మణ్, శ్రీకాంత్, వీరేశం ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నరసింహశాస్త్రి, వెంకటరమణ, అబ్దుల్, వసంతసేన రాజు, మురళీకృష్ణ, నవీన్ కుమార్, అనిల్‌కుమార్, భానుజ్యోతి, ప్రశాంత్‌యాదవ్, సురేందర్ పాల్గొన్నారు.

నవీన్‌యాదవ్‌కు టీయూజేఏసీ మద్దతు



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు తెలుపుతూ ప్రొఫెసర్ ఎం.కోదండరాంకు పత్రాన్ని అందజేస్తున్న టీయూజేఏసీ నేతలు

రాంనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, వైస్ చైర్మన్ పద్మ, ప్రధాన కార్యదర్శులు ఎం.మల్లేష్, జి.యాదగిరి, షేక్ ఫక్రుద్దీన్‌లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని, బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు చిత్తుగా ఓడించాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాంను కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు తెలియజేస్తూ ముద్రించిన పత్రాన్ని అందజేశారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ కుల సంఘాల జేఏసీ



సమావేశంలో అభివాదం చేస్తున్న వీజీఆర్ నారగోని, రాజారాంయాదవ్, కరుణాకర్ ముదిరాజ్, మేకపోతుల నరేందర్‌గౌడ్

రాంనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ కుల సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో బీసీ విద్యార్థి యువజన జేఏసీ చైర్మన్ అనంతరామ్మూర్తిగౌడ్, ఎంబీసీ విద్యార్థి యువజన జేఏసీ చైర్మన్ బడేసాబ్‌ల ఆధ్వర్యంలో కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వీజీఆర్ నారగోని, రాజారాంయాదవ్, కరుణాకర్ ముదిరాజ్, మేకపోతుల నరేందర్‌గౌడ్, రాచాల యుగేందర్‌గౌడ్, గుజ్జ సత్యం, రాంకోటి ముదిరాజ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రాన్ని నేపాల్ తరహా మారుస్తామని హెచ్చరించారు. చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లపై దేశ వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. అన్ని సంఘాలను కలుపుకుని త్వరలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీసీల యుద్ధభేరీ నిర్వహిస్తామన్నారు.



చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి తులసీ కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

ప్రధాని మోదీ కారణ జన్ముడు

ఎంపీ లక్ష్మణ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ డా. లక్ష్మణ్, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, రాగం

చిక్కడపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కారణ జన్ముడని ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ అన్నారు. వసుంధర బిల్డర్స్ ఆధ్వర్యంలో రాగం రచించిన సిద్ధేశ్వరస్వామీజీ జీవిత చరిత్ర యోగస్థ తెలుగు అనువాద పుస్తకావిష్కరణ కార్యక్రమం త్యాగరాయగానసభలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డా. లక్ష్మణ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాచీన కలలు, అలవాట్లు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి పిజ్జాలు, బర్గర్ వంటివి తింటూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. దీంతో చిన్నపాటి జబ్బులతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారన్నారు. ప్రధాని మోదీ మితమైన ఆహారం తీసుకుంటూ దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకువస్తున్నారన్నారు. యోగా, మెడిటేషన్‌తో బలంగా ఉంటూ సమాజాన్ని మరింత బలంగా తయారు చేయాలని సూచించారు. సిద్ధేశ్వర వంటి గురువులు సమాజానికి అవసరమన్నారు. దేశ సంపద అయిన యువత మత్తుపదార్థాలు, మద్యానికి బానిసలుగా మారి సమాజానికి, కుటుంబానికి భారం కాకూడదన్నారు. పుస్తకాలను చదివి దైనందిన జీవితంలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, వసుంధర బిల్డర్స్ వ్యవస్థాపక డైరెక్టర్లు పోతిరెడ్డి రమేష్‌బాబు, వరుణ్‌అగర్వాల్, పోలీస్‌పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ప్రముఖులు రాగం, పోతిరెడ్డి సందీప్, వినయ్‌కుమార్, కె. రాహుల్ కల్యాణ్ స్వామీజీ, జంబునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



షేక్‌పేటలో వృద్ధుడికి కరపత్రం ఇచ్చి ప్రచారం చేస్తున్న శివముదిరాజ్, గోరక్‌నాథ్

ముషీరాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్ని వర్గాల ప్రజల మద్దతుతో విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం యువ నాయకుడు ముఠా జైసింహ సారథ్యంలో ముషీరాబాద్ నుంచి పార్టీ నాయకులు షేక్‌పేటకు తరలివెళ్లి మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం చేశారు. కరపత్రాలు పంచుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివముదిరాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఓటర్లను మభ్యపెడుతూ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూస గోరక్‌నాథ్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



షేక్‌పేట్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

చిక్కడపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని ఆ పార్టీ సీనియర్‌నేత, గాంధీనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సునీతను గెలిపించాలని కోరుతూ షేక్‌పేట్ డివిజన్‌లో ఆదివారం శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రచారానికి విస్తృతమైన స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు జహంగీర్, విఠల్, మిద్దె సురేష్, పోతుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యోత్సవాలు



ట్యాంక్‌బండ్‌పై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తదితరులు

కవాడిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 417 జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి శాసనమండలి ప్రతిపక్షనేత మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఉత్సవ సమితి కన్వీనర్ అడ్లూరి రవీంద్రాచారి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పీఎన్ చారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మదన్‌మోహన్, తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి హాజరై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలజ్ఞానిగా భవిష్యత్తులో జరిగే పరిణామాలను ముందుగానే చెప్పిన మహనీయుడు పోతులూరి బ్రహ్మేంద్రస్వామి అన్నారు. ఆయన అడుగుజాడలలో యావత్ సమాజం ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు రాఘవేందర్, హైమావతి, కరుణశ్రీ, డాక్టర్ టి.నరేందర్, ఆసం కళాధర్‌తో పాటు విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

సగర కులస్థులను బీసీ ఏ కేటగిరిలోకి మార్చాలి

అఖిలభారత సగర మహాసభ నేతల డిమాండ్



మాట్లాడుతున్న ముత్యాల హరికిషన్ సగర

రాంనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సగర కులస్థులు విద్య, ఉద్యోగ రాజకీయ రంగాల్లో వెనుకబడిపోయారని, సగరులను బీసీ-ఏ కేటగిరిలోకి మార్చాలని అఖిలభారత సగర మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. అఖిలభారత మహాసభ ఆధ్వర్యంలో సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో దసరా, దీపావళి సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర, తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగరలు మాట్లాడారు. సగర హక్కుల సాధనకు సంఘటితంగా ముందడుగు వేస్తున్నామన్నారు. బీసీల 42శాతం రిజర్వేషన్ అమలు కోసం బీసీ ఉద్యమం జరుగుతుందని, రిజర్వేషన్ సాధించడం ద్వారా బీసీలతో పాటు సగరులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మన హక్కుల సాధన కోసం ప్రభుత్వాల మెడలు వంచి సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సగర కులస్థుల సంఘటితం కోసం అందరూ పేరు చివరలో సగర అని చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఏపీ నాటి సీఎం ఎన్టీఆర్ బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మారుస్తూ తీసుకువచ్చిన జీవో 165ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాసభ గౌరవ అధ్యక్షుడు శ్రీరాల శ్రీరాములు సగర, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సగర, నాయకులు వేణుగోపాల్, శ్రీధర్, శ్రవణ్, రాజశేఖర్‌రావు సగర, వినోద్ కుమార్, సతీష్, సత్యం, కుమారస్వామి పాల్గొన్నారు.

13 నుంచి సత్యసాయిబాబా శతవర్ష జయంత్యోత్సవాలు



సత్యసాయిబాబా శతవర్ష జయంత్యోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎ.మల్లేశ్వరరావు, దేవేందర్, శ్రీనివాస్ తదితరులు

రాంనగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శతవర్ష జయంత్యోత్సవాలలో భాగంగా ఈనెల 13 నుంచి 23వ తేదీ వరకు నగరంలోని విద్యానగర్ శివం ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం విద్యానగర్‌లోని శివంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ.మల్లేశ్వరరావు, సత్యసాయి స్టేట్ ట్రస్ట్, సత్యసాయి సేవ సంస్థల ప్రతినిధులు దేవేందర్, శ్రీనివాస్‌లు మాట్లాడారు. సత్యసాయిబాబా శతవర్ష జయంత్యోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వేడుకలలో ప్రతిరోజు ఉదయం 6గంటలకు ఓంకారం సుప్రభాతం, నగర సంకీర్తన, పల్లకీసేవ, మహిళలచే ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమం జరుగుతుందన్నారు. 16న ఇంటింటా ఆనందోత్సవం, నృత్యనాటిక, భజన, స్వామి వారి దివ్య సందేశం, హారతి, 17న శివోహం పేరిట స్వామి పూర్వ విద్యార్థులచే ముత్తు కుమార్ బృందంచే మిస్టిక్ వెబ్స్ సంగీత వాద్య కచేరీ, 18న శతరాగ రత్నమాలక శ్రీగంటి శ్రీహర్షచే, 19న మహిళా దినోత్సవాల్లో భక్తి సంగీత కార్యక్రమం, 20న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులచే సమర్పయామి డ్యాన్స్ డ్రామ కార్యక్రమం, 21న కర్నాటక క్లాసికల్ ఫ్యూషన్ బ్యాండ్ ఆహటం, 22న భక్తి సంగీత కార్యక్రమం, 23న స్వామి దివ్య సందేశం, మంగళహారతి కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఈ కార్యక్రమాల్లో వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.



చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల సందర్భంగా తులసీ కల్యాణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

కవాడిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ భవనానికి పెయింటింగ్ వేస్తూ నాలుగో అంతస్తు నుంచి కిందపడి ఓ పెయింటర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 5 రత్నరేఖ అపార్ట్‌మెంట్ వద్ద చోటు చేసుకుంది. సీఐ ఎండీ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ ఆర్టీసీకాలనీకి చెందిన బానోతు వీరన్న(45) వృత్తి రిత్యా పెయింటర్. రోజు వారి వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 5 రత్నరేఖ అపార్ట్‌మెంట్‌లో నాలుగో అంతస్తులో పెయింటింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద జారిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. దోమలగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ మేరు మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం



డీవైఎఫ్ఐ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

నల్లకుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో 46వ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సమాఖ్య కార్యాలయంలో నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, మాజీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు సైదులు, జావిద్, అశోక్‌రెడ్డి, లెనిన్, బానుకిరణ్, అర్జున్, రాజయ్య, దేవేందర్, ప్రవీణ్ పాల్గొని మాట్లాడారు. భగత్‌సింగ్ ఆశయాలతో డీవైఎఫ్ఐ ఏర్పడి నేటికీ 46ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. విద్యా, ఉపాధి కోసం పోరాడే ఏకైక సంఘం డీవైఎఫ్ఐ అన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని పార్సిల్ కార్యాలయం వెనుక భాగంలో 40 నుంచి 45 ఏళ్ల గల గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం గోడకు ఉన్న ప్లాస్టిక్ పైప్‌కు ప్యాంట్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే మృతిచెందిన వ్యక్తి కాళ్లు నేలకు తాకుతుండడంతో అతను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా చంపి ఇక్కడ ప్లాస్టిక్ పైప్‌కు వేలాడదీశారా అనే అనుమానం వ్యక్తం అవుతుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అనుమానాస్పదం కింద బీఎన్ఎస్ఎస్ 194 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నగదు తస్కరణ

రైలులో ప్రయాణం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నగదు ఉన్న పర్సును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నిజాంపేటకు చెందిన గణేష్‌రావు(29) వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. మహారాష్ట్ర నుంచి కాచిగూడకు రావడానికి భగత్ కీ కోటి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మనోహరబాద్ - నిజామాబాద్ రైల్వేస్టేషన్ల నడుమ అతని పర్సును దొంగలు తస్కరించారు. ఆపర్సులో 26వేల నగదు, డెబిట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నాయి. కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు, మాజీ ఎంపీ అజారుద్దీన్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, క్రికెట్ క్రీడాకారుడు చిట్టి శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కే.పీ. మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యూసుఫ్‌గూడలో నిర్వహించిన రోడ్‌షోలో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి రాష్ట్ర నాయకులు ఎడ్ల హరిబాబుయాదవ్, నాగేష్ ముదిరాజ్, వీరేష్ పాల్గొన్నారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి



కాచిగూడలోని శ్యాంబాబా మందిర్‌లో ఆదివారం రెండవ రోజు జన్మోత్సవాల్లో పాల్గొన్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ఇంద్రకరణ్ అగర్వాల్, రాందేవ్ అగర్వాల్, రాజు విగ్, చంద్రకాంత్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ సేన జాతీయ అధ్యక్షుడు దిడ్డి రాంబాబు తన సేన అనుచరులచే ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

వీధిదీపాలు ఆరుగంటలకే ఆన్‌చేయాలి

చిక్కడపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో వీధిదీపాలను సాయంత్రం ఆరుగంటలకే ఆన్‌చేయాలని టీజేఎస్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ చలికాలం కావడంతో తొందరగా చీకట్లు ముసురుకుంటున్నాయని అన్నారు. ఎప్పటిలాగానే ఆరున్నర గంటలకు స్ట్రీట్‌లైట్లు ఆన్ చేస్తుండడంతో వీధులు, కాలనీలు, రోడ్లు అంధకారంలో ఉంటున్నాయన్నారు. దీంతో ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియని స్థితి ఏర్పడుతోందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాయంత్రం ఆరుగంటలకే వీధిదీపాలు వెలిగేవిధంగా టైమింగ్‌లు చేంజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

భవనంపై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలపాలైన యువకుడు

కవాడిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఓ యువకుడు నిర్మాణంలో ఉన్న భవనం రెండవ అంతస్తు నుంచి జారిపడడంతో అతడి శరీరంలోకి మూడు ఇనుప చువ్వలు చొచ్చుకుపోయాయి. ఈసంఘటన దోమలగూడ పీఎస్ పరిధిలోని అశోక్‌నగర్‌లో చోటు చేసుకుంది. సీఐ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన చగన్ అనే ఫాల్‌సీలింగ్ పనులకు సంబంధించి న లేబర్. రోజువారి పనుల్లో భాగంగా అశోక్‌నగర్‌లోని షిరిడీసాయిబాబా మందిరం శివటవర్స్ ప్రాంతంలో నిర్మిస్తున్న భవనంలో పను లు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో అతని శరీరంలోకి మూడు ఇనుప చువ్వలు చొచ్చుకుపోయాయి. వెంటనే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాని కి చేరకున్న పోలీసులు డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో అతడిని రక్షించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపా రు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో ప్రొఫెసర్ వరదరాజులుకు స్థానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీ ప్రచురించిన ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో ప్రొఫెసర్ అనుమకొండ వరదరాజులు స్థానం సంపాదించారు. ఆయన ఈ జాబితాలో స్థానం సంపాదించడం వరుసగా ఐదోసారి కావడం విశేషం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో 33 సంవత్సరాలు అధ్యాపకుడిగా పనిచేసిన అనంతరం 2010లో ఆయన పదవీ విరమణ చేశారు. కానీ పరిశోధనలపై ఉన్న మక్కువతో 75 ఏళ్ల వయసులోనూ పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పదవీ విరమణ అనంతరం యూజీసీ ఎమిరటస్ ఫెల్లోలో ఎంపికై శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలోనే పర్యావరణ హిత ప్లాస్టిక్‌పై పరిశోధనలు చేశారు. సీఎస్ఐఆర్ ఎమిరటస్ సైంటిస్ట్‌గా ఎంపికై ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో నానోకంపోజిట్స్‌పై పరిశోధనలు చేశారు. ఆయన తన పరిశోధనా క్రమంలో రూపొందించిన 258 పరిశోధనా పత్రాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.